క్లుప్తంగా

అభివృద్ధిపై దృష్టి సారించాలి


సర్పంచ్‌లతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

దర్శి: అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీపీ గోళ్లపాటి సుధారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లతో రీప్రెష్‌మెంట్ శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచ్‌లు, అధికారులు శిక్షణ పొంది గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి సర్పంచ్, ఉప సర్పంచ్ గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలన్నారు. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు సహకరించాలి

తాళ్లూరు (దర్శి): గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ సాని కొమ్ము సత్యం అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు రీప్రెస్‌మెంట్ శిక్షణ తరగతులు మంగళవారం ఎంపీపీ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. సత్యం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జెడ్పీటీసీ మారం వెంకారెడ్డి, ఈఓఆర్డీ కె.సుందరరావు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు

గుండ్లకమ్మకు
లిఫ్ట్ ఇరిగేషన్ ఎప్పుడు?

దొనకొండ మండలం కొచ్చర్లకోట పంచాయతీ పరిధిలో సిద్ధాయపాలెం శివారున సెలయేరుగా పారుతున్న గుండ్లకమ్మ లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత రైతులు చాలా కాలంగా ప్రభుత్వాలను కోరుతున్నారు. ఇదే జరిగితే ఆరు గ్రామాల ప్రజలకు సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవంటున్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిన టీడీపీ నేతలు ఇప్పుడా ఊసే ఎత్తడం లేదు.

- చాలా కాలంగా ఎదురు చూస్తున్న రైతులు
- బీడు భూములన్నీ మాగాణిగా అభివృద్ధి చెందే అవకాశం
- ఆ ప్రాంత ప్రజలకు సాగు, తాగు నీటికి ఇబ్బందులు లేనట్లే


సిద్ధాయపాలెం వద్ద పారుతున్న గుండ్లకమ్మ (ఫైల్)

దొనకొండ:

మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీ పరిధిలో సిద్ధాయపాలెం శివార్లలో సెలయేరులా పారుతున్న గుండ్లకమ్మ నదిపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి బీడు భూములను మాగాణిగా మార్చి సాగు, తాగు నీరు అందించాలని పుల్లాయపల్లి, బసిరెడ్డిపల్లి, కట్టకిందపల్లి, నారపురెడ్డిపల్లి, సిద్ధాయపాలెం, కొచ్చెర్లకోట, ఎస్సీ పాలెంలు, రామాపురం గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వర్షాభావ పరిస్థితులతో తాము పంటలు పండించుకోలేక పోతున్నామని, లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తే కొచ్చెర్లకోట పంచాయతీలోని 6 గ్రామాలకు చెందిన నాగుల చెరువు, కొత్తచెరువు, కొచ్చెర్ల చెరువు, పుల్లాయిపల్లి చెరువు, రామాపురం చెరువు మరికొన్ని కుంటలకు నీరు సరఫరా చేయవచ్చంటున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు సాగు, తాగు నీటికి ఇబ్బందులు లేకుండా పోతుంది. గతంలో ప్రజా ప్రతినిధులకు ఎన్నో సార్లు తమ గ్రామస్తులు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ చెరువులకు నీరు సరఫరా చేస్తే సుమారు 10 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని, అంతేకాకుండా తాగునీరు కూడా సమృద్ధిగా ఉంటుందని, పశుగ్రాసం కొరత లేకుండా పాడి పరిశ్రమ అభివృద్ధి చేసుకోవచ్చని గ్రామాల ప్రజలు చెప్తున్నారు. వర్షం పడిన సమయంలో నీరు సెలయేరులా పారి వృథాగా పోతున్నాయని, మన కళ్ల ముందే మనం వాడుకోవాల్సిన నీరు వృథా కావటం ఏమిటని, చెరువులకు నీరు సమృద్ధిగా ఉంటే భూగర్భ జలాలు పెరుగుతాయని, వేసవిలో ఇబ్బంది లేకుండా ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా తమకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు కోరుతున్నారు.



పంటలు పండాలి: మా గ్రామానికి చెందిన చెరువుకు నీరు సరఫరా చేయాలంటే లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలి. తాగు, సాగుకు సమస్య లేకుండా పోతుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. వేసవిలో ఇబ్బంది లేకుండా ఉంటుంది. ప్రజాప్రతినిధులు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలి.

గొంగటి పోలిరెడ్డి, బసిరెడ్డిపల్లి



10 వేల ఎకరాలకు సాగు నీరు: గుండ్లకమ్మ వాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తే సుమారు 10 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. అలాగే మా గ్రామాలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. వర్షాలు పండక పోతే మేమంతా దూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుంది.

చీరాల ఇశ్రాయేల్, ఎస్సీ పాలెం


చిల్లచెట్లతో మూసుకుపోయిన రోడ్డు

అధ్వానంగా కొచ్చెర్లకోట–మార్కాపురం రోడ్డు

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట నుంచి మార్కాపురం వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లతో మూసుకుపోయింది. దీంతో వాహనాల రాక పోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. పాదాచారులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు ఈ రహదారి నుంచి వెళ్లాలంటే చిల్ల చెట్లు మూసుకుపోయి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. రాత్రి వేళల్లో ఎదురు ఎదురుగా వాహనాలు ఢీకొన్న సంఘటనలు జరిగాయి. ప్రమాదాలు జరిగాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొచ్చెర్లకోట నుంచి నిత్యం ఆ రోడ్డు రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా రైతులు ఎక్కువ భాగం పొలాలకు వెళ్తుంటారు. ఎన్నోసార్లు చిల్లచెట్లు తొలగించాలని అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని కొచ్చెర్లకోట, సిద్ధాయపాలెం గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

తాళ్లూరు (దర్శి): మండలంలో మొక్కజొన్న పంటలు వేసి చిన్న చిన్న కండెలుగా వచ్చి నష్టాల పాలైన రైతుల పంట పొలాలను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీవీసీఎం రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారుల నుంచి వర్షపాతం, వాతావరణ సమాచారం సేకరించి వీటన్నింటి వివరాల ఆధారంగా శాస్త్రవేత్తలు అధ్యయనం చేసి నివేదికను వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్నలో ఆశించిన దిగుబడి రాక కండెలు చిన్నవిగా రావడంతో రైతులు శాస్త్రవేత్తలకు తెలుపగా వచ్చి పరిశీలించామన్నారు. అన్నీబోట్లా మొక్క జొన్నను విత్తుకున్నారని, భారతి 756 అనే రకాన్ని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసినట్లు రైతులు తెలిపారన్నారు. రెండేళ్లుగా 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయని, ఈ సంవత్సరం కండెలు చిన్నవిగా రావడంతో దిగుబడులు తగ్గాయని, రైతులు, వ్యవసాయాధికారులు చెప్పారన్నారు. వీటితో పాటు అడ్వాంటా హైబ్రిడ్ 751, శ్రీరామ సీడ్స్ వారి క్షేత్రాలను పరిశీలించామన్నారు. వీటిలో కండె పరిమాణంలో వ్యత్యాసం తక్కువగా ఉందన్నారు. గతంలో మిరప వేసిన పొలాల్లో కండెలు బాగా ఉన్నాయని చెప్పారు. అనంతరం రైతులతో చర్చించి సాగు విధానం, నేలలు, నీటి లభ్యత, విత్తనాల కొనుగోలు, వాటి ధరలు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఏఓ ప్రసాద్‌రావు, వీఏఏలు నాగరాజునాయక్, వెంకట్రావు, అశోక్, సుధీర్ పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జగజ్జననికి భక్త నీరాజనం


వైపాలెం: మంగళ గౌరీదేవి అలంకరణలో వాసవీ అమ్మవారు


కురిచేడు: లక్ష్మీదేవిగా దర్శనం ఇస్తున్న జ్ఞాన ప్రసూనాంబ


దొనకొండ: లలితాంబిక అలంకరణలో ఈశ్వరీదేవి

పెద్దదోర్నాల: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో వెలసిన అమ్మవార్లకు భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత శ్రీలలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అశ్వయుజ శుద్ధమి మంగళవారం వేకువ జాము నుంచే అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి అర్చకులు బి.రాంప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, చండీపారాయణం నిర్వహించారు. మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీలలితా సహస్రనాయ పారాయణం చేశారు. స్థానిక పోలేరమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రులను పురస్కరించుకుని ఆలయంలో వెలసిన అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం 10 గంటలకు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. మండల పరిధిలోని మోట్ల మల్లికార్జున పురంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. **యర్రగొండపాలెం:** స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు మంగళవారం భక్తులకు మంగళగౌరీ దేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు సూరె వెంకటప్రసాద్, గుర్రం కృష్ణమూర్తి, గ్రంధి రమణారావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. **దొనకొండ:** దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మంగళవారం 6వ రోజు ఆశ్వీజ శుద్ధ పంచమి ఆనంద ఆశ్రమంలో వెలసిన ఈశ్వరీదేవి లలితాంబికగా దర్శనమిచ్చారు. పూజారి మణిశర్మ ఉదయం 7 గంటల నుంచి పంచామృత అభిషేకాలు, అష్టోతర నామావళి, సామూహిక కుంకుమ పూజలు చేసి ధూప దీప నైవేద్యం సమర్పించారు. నరసింహానాయునిపాలేనికి చెందిన ఎర్రమరెడ్డి పిచ్చిరెడ్డి, రమాదేవి దంపతులు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. బుధవారం మూలం నక్షత్రం సందర్భంగా ఈశ్వరీదేవి, సరస్వతీదేవిగా దర్శనమిస్తుందని భైరవానంద స్వామి తెలిపారు.

పుల్లలచెరువు: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మంగళవారం జరిగిన అలంకరణలో ముటుకుల ఆలయంలో శ్రీరేణుక ఎల్లమ్మతల్లి శ్రీమహాలక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి భరద్వాజశాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రతి రోజూ రాత్రి అన్నదానం ఏర్పాటు చేశారు.

త్రిపురాంతకం: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసర శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మహిళలు, దంపతుల పూజలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. త్రిపురాంతకం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ప్రత్యేక అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తున్నారు. మంగళవారం రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రోజూ రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనం అందిస్తున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

పెద్దారవీడు: విజయదశమి శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని మండలంలో రాజంపల్లెలో వెలసిన శ్రీ గొంద్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. అర్చకులు భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కురిచేడు: మండలంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. శివాలయంలో జ్ఞాన ప్రసూనాంబాదేవి అమ్మవారు లక్ష్మీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలో అందంగా అలంకరించారు. అస్టోత్తర శతనామావళి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కుల తీర్చుకున్నారు.


పుల్లలచెరువు: ముటుకులలో శ్రీమహాలక్ష్మీదేవి


త్రిపురాంతకం: రాజరాజేశ్వరి అలంకారంలో వాసవీ అమ్మవారు


పెద్దారవీడు: రాజంపల్లిలో ప్రత్యేక అలంకరణలో రాజ్యలక్ష్మి అమ్మవారు


కురిచేడు: గజలక్ష్మీదేవిగా దర్శనం ఇస్తున్న అమ్మవారు


పెద్దదోర్నాల: లలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

మిరపలో సూక్ష్మధాతు లోపం


రైతులకు సూచనలిస్తున్న ఏవో నిర్మలాదేవి


కందిపంటను పరిశీలిస్తున్న అధికారులు


పెద్దారవీడు: మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి


వేప గింజల కషాయాన్ని తయారు చేస్తున్న గిరిజనులు


మాట్లాడుతున్న ఏఓ మధుబాబు

యర్రగొండపాలెం: మిరప పంటలో రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడుతూ, సేంద్రియ ఎరువుల వాడకం తగ్గిస్తే పంటలో సూక్ష్మధాతు లోపం ఎక్కువగా కనిపిస్తుందని ఉద్యానశాఖాధికారి పి.ఆదిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గంగాపాలెం, నరసాయపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మిరప నాటిన 30 రోజుల నుంచి నెలకు ఒక పర్యాయం సూక్ష్మపోషకాలు కలిపిన మిశ్రమాన్ని 2.5 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి ఎల్.మాల్యాద్రి రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కంది కల్లె దశలో ఉందని, పంట చిగుర్లను ఒక అడుగు మేర కత్తిరించాలని, దీంతో పైరు ఏపుగా పెరిగి కాయ తొలచు పురుగును నివారించుకోవచ్చన్నారు. మొగ్గదశలో పురుగు గుడ్లను గుర్తించిన వెంటనే 5 శాతం వేప నూనె, క్లోరోపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లేకుంటే క్వినాల్ ఫాస్ 2 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేస్తే పురుగులను అరికట్టవచ్చని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ ఎంఐఏవో పి.రామిరెడ్డి, వీఏఏ ఎ.చైతన్యకుమార్, వీహెచ్ఏ బి.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు అవగాహన

పెద్దదోర్నాల: మండల పరిధిలోని నల్లగుంట్ల, కొర్రప్రోలులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లగుంట్ల బోడుగూడెంలో గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వేపగింజల కషాయం, బీజామృతం విత్తనశుద్ధి చేసి సాగు చేయడంతో తెగుళ్ల నివారించవచ్చని తెలిపారు. వ్యవసాయ సహాయకులు మల్లూనాయక్, ప్రకృతి వ్యవసాయ యడవల్లి యూనిట్ క్యాడర్ అల్లూరి శ్రీనివాసులు, తప్పెట్ల ప్రమీల, మాణిక్యం, సువర్ణ పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

పుల్లలచెరువు: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితే ఖర్చు తగ్గి నాణ్యమైన దిగుబడులు వచ్చే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని గంగవరం, పుల్లలచెరువు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలోని పొలాల్లో వేసిన పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వ్యవసాయం చేసే ప్రతి రైతు ముఖ్యంగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. దానికి అనుగుణంగా ఎరువులు దాంతో పాటు మందులను వాడుకుంటే ఖర్చు తగ్గడంతో పాటు రైతులకు నాణ్యమైన దిగుబడులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పశువైద్యాధికారి నాగుల్‌మీరా మాట్లాడుతూ పశువులకు గడ్డి కోసే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులకు సబ్సిడీపై రూ.17 వేలు పోను రైతులు కట్టాల్సింది రూ. 20 వేలు మాత్రమేనని తెలిపారు. ఏపీసీఎన్ఎఫ్ అధికారి కాశయ్య మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం గురించి ఆలోచనలు చేయాలన్నారు. ఘన జీవామృతం, ద్రవజీవామృతం, బీజామృతం, వేపగింజల కషాయం, వీటిని తయారు చేసి పంటలకు వాడితే పంటలు మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ బ్రహ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల, బోయిదగుంపుల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి మాట్లాడుతూ కంది పంటలో మేలైన రకాలు పురుగులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కంది పంటలో శనగపచ్చ పురుగు, మారుకా మచ్చల పురుగు, కాయ ఈగ, రసం పీల్చే పురుగులు ఎక్కువగా నష్టం కల్గిస్తాయని చెప్పారు. శనగపచ్చ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే పైరు మొక్క తొలి పూత దశలో క్లోరిపైరీఫాస్ 2ఎంఎల్ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తి పంటలో ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాతావరణ సూచనలకు తగినట్లుగా తెగుళ్ల నివారణ చర్యలు ఎలా చేపట్టాలో వివరంగా తెలియజేశారు. సర్పంచ్ ఏర్వ ఆల్లూరమ్మ, ఎంపీటీసీ ఏర్వ వెంకటనారాయణరెడ్డి, వీఏఏలు రామాంజనేయులు, రఫీ, రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: మండలంలోని ప్రతి రైతు తమ పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ పి.మధుబాబు తెలిపారు. మండలంలోని పడమర గంగవరం, అలవలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. రైతుల పొలాలు పరిశీలించి పురుగులు, తెగుళ్లు, నివారణ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ కంది, పొగాకు, పత్తి పంటల్లో ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. బిదుసేద్యం, తుంపర సేద్యంలో ప్రభుత్వ రాయితీల గురించి వివరించారు. వీఏఏలు వెంకటరామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధిపై శ్రద్ధ వహించాలి

ముండ్లమూరు (దర్శి): గ్రామాల అభివృద్ధిపై అధికారులు శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ఆర్.జనార్దన్ సూచించారు. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లతో రీప్లేస్‌మెంట్ శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ జనార్దన్ మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయడంలో అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు ముందుండాలన్నారు. మౌలిక వసతులు ప్రజలకు అందుబాటులోకి తేచ్చే విధంగా కృషి చేయాలన్నారు. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఈఓపీఆర్డీ

కొనకనమిట్ల: మండల పరిషత్ విస్తరణాధికారిగా జి.శ్రీదేవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ముండ్లమూరు మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా కొనకనమిట్లలో నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈఓపీఆర్డీగా, ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేసిన రావూరి జనార్దన్ ముండ్లమూరు మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన ఈఓపీఆర్డీకి కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

14న సర్వసభ్య సమావేశం

మార్కాపురం రూరల్: ఈనెల 14వ తేదీన మార్కాపురం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ భాగ్యవతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని స్పష్టం చేశారు.